క్లుప్తంగా

సరుకులు అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబానికి చెందిన నేర్పల్లి సోమయ్య –నాగక్క దంపతుల కుమార్తె వివాహానికి కౌటాల మాజీ ఎంపీటీసీ సభ్యులు బసర్కార్ శిరీష శనివారం ఉచితంగా 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు సాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు అశోక్, ప్రకాశ్, గోపాల్, వెంకటి, విఠల్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యానైపుణ్యాల పెంపునకు సమ్మర్ క్యాంపు



బోధిస్తున్న ఎంఈవో పవార్ అనిత

నార్నూర్: విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంచడానికి సమ్మర్ క్యాంప్ ఎంతో దోహదపడుతాయని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌సీఈఆర్‌పీ వినోద్, ఉపాధ్యాయుడు జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇచ్చోడలో వర్షం

ఇచ్చోడ: మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. 5 గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో 20 నిమిషాల పాటు వర్షం పడింది. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి అధ్యక్షుడు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. భారత సైనికులకు సంఘీభావంగా జాగృతి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించినట్లుగా ఆయన తెలిపారు.

చిన్నారులు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో చిన్నారులను ఆధ్యాత్మికత వైపు తీసుకెళ్లాలనే ఆలోచనతో వేసవి శిబిరాన్ని నిర్వహించామని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవానంద ప్రభూజీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ముంబాయి జిన్నింగ్‌లోని ఇస్కాన్ ఆలయంలో గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. పిల్లలకు ఆధ్యాత్మిక క్రీడలు, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. శిక్షణలో సుమారు వంద మంది పిల్లలు హాజరయ్యారు. ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుడి ప్రవచనాలతో పాటు గీతాలు ఆలపించారు. ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి చతుర్థి సందర్భంగా ఇస్కాన్ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారి తెలిపారు.

హజ్ యాత్రికులకు సన్మానం

కైలాస్‌నగర్: హజ్ యాత్రకు వెళ్లే వారిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదాన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లింలను సత్కరించారు. అంతకుముందు యాత్రికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు ఎం.ఏ షకీల్, ముజాహిద్దీన్, మొహమ్మద్ రఫీక్, షేక్ ఖలీం, అంజద్ ఖాన్, తౌఫిక్, అస్బాత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి

బోథ్: మండల కేంద్రంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విశ్వేశ్వర రావు జయంతిని శనివారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షులు ఎలుక రాజు, కోశాధికారి బోడ లక్ష్మణ్, బోథ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేందర్, జనరల్ సెక్రెటరీ ఉషన్న, రవి, రమేశ్, రాజు, భోజన్న కుల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అధ్వానంగా.. ప్రమాదకరంగా!



ఈ ఫొటోలో ప్రమాదకరంగా కన్పిస్తున్న భారీ గుంత సైడ్‌డ్రైయిన్ నిర్మాణం కోసం తవ్వారు. కానీ సదరు గుత్తేదారు నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశాడు. సర్వీస్ రోడ్డుపై ప్రయాణికుల కోసం హైవే అథారిటీ వారు నిర్మించిన బస్టాండ్ పక్కనే ఈ భారీ గుంత ఉంది. ఇదొక్కటే కాకుండా మరో నాలుగు భారీ గుంతలు అదే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్నాయి. డ్రైయిన్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా వదిలేసి దాదాపు ఏడాది గడిచినా నిర్మాణ యాజమాన్యం ఇటువైపు తిరిగి చూడటం లేదు. ఆదమరిచి ఎవరైనా అందులో పడితే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని మండలవాసులు ఆందోళ చెందుతున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటితో అధ్వానంగా కన్పిస్తున్న ఈ ఫొటోలోని ప్రాంతం వాంకిడి మండల కేంద్రంలోనిది. నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మించిన సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా సైడ్‌డ్రైయిన్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ఇలా అధ్వానంగా మారింది. అంబేడ్కర్‌నగర్ కాలనీకి వెళ్లే అంతర్గత రహదారికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం మురుగు నీటితో దుర్గంధం వెదజల్లుతోంది. మురికి నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతంలోని దుకాణదారులు, స్థానికులు దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు.

- అసంపూర్తిగా సైడ్‌డ్రైయిన్‌లు
- లోపిస్తున్న పారిశుధ్యం
- ప్రమాదకరంగా గుంతలు
- పట్టించుకోని హైవే అథారిటీ అధికారులు

వాంకిడి: మండల కేంద్రం గుండా నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారి –363 నిర్మాణంలో జరిగిన జాప్యానికి మండల వాసులు, దుకాణదారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు నిర్మాణ పనుల్లో సదరు కాంట్రాక్టర్ జాప్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా కొన్ని పనులు పూర్తి కావడం లేదు. రహదారి నిర్మాణంతో మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారగా దానికి తోడు అసంపూర్తిగా పనులు వదిలేయడంతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. కాలనీలలోని మురుగు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. మురికి కాలువల నిండా నీరు నిల్వ ఉంటుంది. దీని వలన దోమల వ్యాప్తి పెరగడమే కాకుండా దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంబేడ్కర్‌నగర్ కాలనీ వైపు సర్వీస్ రోడ్డుకు ఆనుకుని సైడ్ డ్రైయిన్ కోసం నాలా తవ్వి అలాగే వదిలేయడంతో మురుగు నీరు, చెత్తా చెదారంతో ప్రధాన రహదారి గుండానే పారిశుధ్యం లోపించింది. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే కానీ మండలంలో పారిశుధ్యం కుదుటపడే అవకాశాలు కన్పించడం లేదు. అలాగే రహదారికి మరోవైపు బస్టాండ్ పక్కనే భారీ గుంతలు తవ్వి వదిలేశారు. మురికి నీటిని వాగువైపునకు మళ్లించేందుకు చేసిన ప్రయత్నాలను మధ్యలోనే వదిలేయడంతో ప్రస్తుతం పరిస్థితి ప్రమాదకరంగా మారింది. బస్టాండ్ ఆనుకుని ఒక గుంత, ఆటో స్టాండ్ వద్ద మరో గుంత, అదే ప్రాంతంలో మరో రెండు భారీ గుంతలు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్నాయి. నిత్యం వందలాది జనాలు ఆ ప్రాంతాల్లోనే బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న ఆ ప్రాంతంలో జనాలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సులు వచ్చిన సమయంలో ట్రాఫిక్ సమస్య సైతం ఏర్పడుతుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం లోపించింది..



మండల కేంద్రం గుండా నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారి వల్ల పారిశుద్ధ్యం లోపించింది. రెండేళ్ల క్రితం సైడ్‌డ్రైయిన్ పనులు ప్రారంభించి పూర్తి చేయకుండానే వదిలేశారు. ఒకవైపు భారీ గుంతలు ప్రమాదకరంగా ఉంటే మరోవైపు పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– పీతాంబర్, వాంకిడి

నిర్మాణాలు చేపట్టాలి..



అసంపూర్తిగా వదిలేసిన సైడ్‌డ్రైయిన్ పనులు వెంటనే ప్రారంభించాలి. నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేయడంతో రహదారి గుండా పరిసరాలు అధ్వానంగా మారాయి. డ్రైయిన్ నిర్మాణం పూర్తి చేయకపోతే రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా మారుతుంది. పాలకులు దృష్టి సారించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– కంటేశ్వర్, స్థానికుడు

చదువుతోనే అభివృద్ధి సాధ్యం



వృద్ధులకు అక్షరాలు నేర్పిస్తున్న సుదిల్ల రమేశ్

వాంకిడి: అందరి తలరాతలు మార్చేది చదువు ఒక్కటేనని, చదువుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుందిల్ల రమేశ్ అన్నారు. అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే నినాదంతో అక్షర చైతన్య యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నవేగాం గ్రామంలో చదువు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పలకలు, బలపాలు పంపిణీ చేసి వృద్ధులకు, నిరక్షరాసులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అక్షరాస్యతలో చాలా వెనుబడి ఉందని, ప్రతీ ఒక్కరు చదువు ప్రాముఖ్యతను తెలుసుకొని ఎదగాలన్నారు. గ్రామాల్లో విద్యను బలోపేతం చేసేందుకు తనవంతు కృషిగా 12 అంశాలపై అక్షర చైతన్యయాత్రలో భాగంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలోని కుమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ డబ్బా గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కుమురం భీం విగ్రహాన్ని ఈ నెల 12న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఆదివాసీలు, నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నికోడే గంగారాం, నాయకులు గట్టయ్య, పోచం, నాహీం, సుధాకర్, రవి, ధరయ్య, కోటేశ్, విఠల్, సుధాకర్, చెన్నమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు లేక ఇక్కట్లు

దహెగాం: దహెగాం నుంచి కాగజ్‌నగర్ రూట్‌లలో ఆర్టీసీ సేవలు లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గత ఆరు నెలల క్రితం ఆర్టీసీ బస్సు సేవలు నడిపించి మధ్యలో నిలిపివేశారు. దీంతో ప్రజలకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. దహెగాం నుంచి కాగజ్‌నగర్ వరకు సుమారు 20 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు అవసరాల నిమిత్తం నిత్యం వందల మంది కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్తుంటారు. ఆర్టీసీ సేవలు లేనందున ప్రైవేటు ఆటోలలో అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణానికి ప్రైవేటు వాహనాల్లో ఒక్కొక్కరికి రూ. 60 చార్జీ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నా దహెగాం ప్రజలకు ఉపయోగంలో లేదని వాపోతున్నారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు మండల కేంద్రానికి మాత్రం బస్సు రావడం లేదని వాపోతున్నారు. పలుమార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాగజ్‌నగర్ నుంచి దహెగాం వరకు ఆర్టీసీ బస్సు సేవలు నడిపించాలని కోరుతున్నారు.

డిగ్రీ పరీక్షలు జరిగేనా..?

- ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడ్డ పరీక్షలు
- రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ప్రైవేట్ యాజమాన్యాల డిమాండ్
- పరీక్షలు ఆలస్యం కావడంతో అయోమయంలో విద్యార్థులు
- అకాడమిక్ ఆలస్యమవుతుందని ఆందోళన



కాకతీయ యూనివర్సిటీ

బోథ్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలపై సందిగ్ధత నెలకొంది. పరీక్షలు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉండగా, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు సహకరించకపోవడంతో పరీక్షలు రెండుసార్లు వాయిదా వేశారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4, 6 (రెగ్యులర్), 1, 3, 5 (బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్షల కోసం యూనివర్సిటీ అధికారులు అన్ని సిద్ధం చేశారు. అయితే రెండుసార్లు పరీక్షలు వాయిదా పడ్డాయి. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. దీంతో యూనివర్సిటీ అధికారులు పరీక్షలను వాయిదా వేస్తూ వస్తున్నారు.

పరీక్ష ఫీజులు చెల్లించని ప్రైవేట్ కళాశాలలు..

డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్‌లతో పాటు 1, 3, 5 సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల నిర్వహణకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కళాశాలల్లో విద్యార్థులు పరీక్ష ఫీజులు సైతం చెల్లించారు. విద్యార్థులు చెల్లించిన పరీక్ష ఫీజులను కొన్ని ప్రైవేట్ కళాశాలలు యూనివర్సిటీకి చెల్లించకపోవడంతో గత నెల 21వ తేదీన జరగాల్సిన పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. మళ్లీ 28వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టైంటేబుల్‌ను విడుదల చేశారు. అయితే అప్పటికీ పరీక్ష ఫీజులను కొన్ని కళాశాలలు చెల్లించకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు. తాజాగా మే, 14వ తేదీ నుంచి మళ్లీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మేరకు పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఈసారి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించిన కళాశాలలకు మాత్రమే పరీక్షలు ఉంటాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఒక ప్రైవేట్ కళాశాల మాత్రమే విద్యార్థుల ఫీజు చెల్లించినట్లు సమాచారం.

అప్పుల ఊబిలో ప్రైవేట్ కళాశాలలు..

జిల్లాలో 2021 నుంచి ఫీజు బకాయిలు రాక ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి. నాలుగేళ్ల నుంచి దాదాపు 50శాతం ఫీజు బకాయిలు రాలేదని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తామని హామీలు ఇచ్చినా, చెల్లించడం లేదని చెబుతున్నారు. కళాశాల నిర్వహణ భారంగా మారిందని, ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయామని పేర్కొంటున్నాయి. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి పైసా ఇవ్వలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. అధ్యాపక వేతనాలు, భవనాల అద్దెలు, విశ్వవిద్యాలయ ఫీజులు చెల్లించటం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తమకు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని పేర్కొంటున్నాయి.

ఆదాయం సరే.. వసతులేవి?

- అధ్వానంగా పశువుల సంత నిర్వహణ
- ఏటా రూ.లక్షల ఆదాయం
- వసతులు కల్పించని వైనం
- కనీస సౌకర్యాలు కల్పించాలని రైతుల వినతి



ప్రైవేట్ స్థలంలో ఎండలోనే పశువుల సంత నిర్వహణ

కౌటాల: కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే పశువుల వారసంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తోంది. అయినా సంతలో వసతులు కల్పించడంలో నిర్వాహకులు విఫలమవుతున్నారు. దీంతో వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

జిల్లాలోనే అతిపెద్దది..

కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ సోమవారం నిర్వహించే పశువుల సంత జిల్లాలోనే అతిపెద్ద పశువుల సంత. ఈ ఏడాది నిర్వహించిన పశువుల సంత వేలం ద్వారా రూ. 28.45 లక్షల ఆదాయం గ్రామ పంచాయతీకి చేకూరింది. ఏటా సంత నిర్వహణతో లక్షలాది రూపాయల ఆదాయాన్ని అర్జిస్తున్నారు. కానీ సంతలో అందుకు తగ్గ వసతులు కల్పించకపోవడంతో సంతకు పశువులను తీసుకొచ్చే వారు ఇబ్బందులకు గురువుతున్నారు. ప్రతీ ఏడాదికి ఒకసారి సంత వేలం నిర్వహిస్తుంటారు. వేలంతో వచ్చిన డబ్బుతో సంతలో సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అధికారులు అవేమి పట్టించుకోవడం లేదని రైతులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

సౌకర్యాల జాడేది..

మండల కేంద్రంలో నిర్వహించే పశువుల సంతకు ప్రభుత్వ స్థలం లేదు. గతంలో పశువుల సంతను బీరన్న ఆలయ ఆవరణలో నిర్వహిస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు అభ్యంతరం తెలపడంతో ప్రస్తుతం సంతను గ్రామ సమీపంలోని మినీ స్టేడియం సమీపంలో నిర్వహిస్తున్నారు. సంత నిర్వహణతో రూ. లక్షల ఆదాయం వస్తున్నా సంతకు సొంత స్థలం కేటాయించకపోవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల సంతలో తాగునీటి వసతి లేదు. దీంతో పశువులకు దాహం వేస్తే వాటి దప్పిక తీర్చడం కోసం పశు యజమానులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. రైతులు, వ్యాపారులకు దాహం కేకలు తప్పడం లేదు. అలాగే పశువుల సంతలో నీడ వసతి లేదు. స్థానిక చెట్ల నీడ వద్ద కూర్చుంటున్నామని వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండాకాలం కావడంతో సంతలో నీటి వసతి లేకపోవడంతో కొంత మంది రైతులు ఇంటి వద్ద నుంచి వాటర్ బాటిళ్లలో తాగునీరు వెంట తెచ్చుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు, ప్రజలు వాటర్ ప్యాకెట్లను కొనుగోలు చేసి తాగుతున్నారు.

పట్టించుకోని అధికారులు

కౌటాల పశువుల సంతకు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వందలాదిగా రైతులు వస్తుంటారు. వందల సంఖ్యలో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన పశువుల సంతలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువుల సంతకు సొంత స్థలం కేటాయించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. కాగా పశువుల సంతకు సొంత స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని, సంతలో కనీస సౌకర్యాలు కల్పిస్తామని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

స్థలం కేటాయించాలి

కౌటాల పశువుల సంత రోజు వందల పశువులను రైతులు విక్రయానికి తీసుకొస్తుంటారు. పశువుల సంతకు సొంత స్థలం లేకపోడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల సంతలో తాగునీటి సౌకర్యం లేదు. దీంతో వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగుతున్నాం. పశువులకు నీళ్లు పెట్టాలంటే చాలా ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి పశువుల సంతకు సొంత స్థలం కేటాయించడంతో పాటు సంతలో కనీస సౌకర్యాలు కల్పించాలి. – శివరాం, రైతు, కౌటాల

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సమ్మర్ క్యాంప్ పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌తో విద్యార్థులు అనేక విషయాలు నేర్చుకుంటున్నారన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు ఉచితంగా యోగా, కరాటే, నృత్యం, డ్రాయింగ్, పేయింటింగ్స్, ఇండోర్ గేమ్స్ ఆడిస్తామని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శిక్షకులు సంగీత, తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు

బోథ్: పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరాటంలో భారత సైనికులంతా క్షేమంగా ఉండాలని సొనాల మండలంలోని రామాయలంలో హిందూ ధర్మ జాగరణ మండలి సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ప్రతీ శనివారం నిర్వహించే పారాయణం 73 వారాలకు చేరుకుందని తెలిపారు. వంద వారాల పాటు సామూహిక పారాయణం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఈ తిరుపతి రెడ్డి, సిబ్బంది

తాంసి: విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ వినియోగదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీంపూర్ విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతి రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నిపాని సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ ప్రమాదాల నివారణ పోస్టర్ ఆవిష్కరించారు. ఏఈ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వాడకంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా లూజ్ విద్యుత్ తీగలు ఉంటే సిబ్బంది తెలియజేసి మరమ్మతులు చేయించుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్, రాజు, వెంకట్ తదితర సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణంలోని 33/11 కేవీ జన్కాపూర్‌లోని విద్యుత్ ఉప కేంద్రంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మిరాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రాహ్మణవాడ, రావులవాడ, కంచుకోట, ఓల్డ్‌పోస్ట్ ఆఫీస్ ఏరియా, సందీప్‌నగర్, నూర్‌నగర్, జన్కాపూర్ రామాలయం ఏరియా, కేబీ చౌక్, ఉస్మానియా మసీద్, దస్నాపూర్, హడ్కోకాలనీ, రహ్మత్‌నగర్, జుబ్లీ మార్కెట్ మెయిన్ రోడ్, ఎన్‌జీవో కాలనీ, ఎక్స్‌ప్రెస్ జిన్నింగ్ లైన్, కలెక్టరేట్ ఆఫీస్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.